విద్యాసంస్థల్లో 'ఎఫ్ఆర్ఎస్' తప్పనిసరి

- విద్యార్థులు, బోధనా సిబ్బందికి అమలు
- స్కూళ్లు, కాలేజీలు, వృత్తి విద్యా కళాశాలలకూ వర్తింపు
- గ్రీన్‌ఛానల్ ద్వారా మధ్యాహ్న భోజనం బిల్లులు
- విద్యాశాఖ సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకు ప్రతి విద్యాసంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని, విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు మరింత పెంచాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా కోర్సులు బోధించే కాలేజీల్లో విద్యార్థులు, బోధనా సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్) తప్పనిసరి చేయాలన్నారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతోపాటు వృత్తి విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చని అన్నారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి)లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సిఎం అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యతాప్రమాణాలు, వాటి పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికిగానూ ఒకే విభాగం కింద ఉండాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ (టిజిఇడబ్ల్యుఐడిసి) కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలూ కొనసాగాలని సిఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజనీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యుటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్‌ఛానల్ ద్వారా చేపట్టాలని, ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సిఎం అన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం

కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలి

రాష్ట్రంలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకోవచ్చని కోరారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సిలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సిలర్లను నియమించాలని సూచించారు. విద్యారంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో 90 శాతం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులే

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లతోపాటు విద్యారంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బిఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికిపైగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలే ఉన్నారని చెప్పారు. ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి అజిత్‌రెడ్డి, ముఖ్యమంత్రి ఒఎస్‌డి వేముల శ్రీనివాసులు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ వి బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌లో సురవరం సంస్మరణ సభ

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరగనుంది. ఈ మేరకు సిపిఐ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 23న సురవరం సుధాకర్‌రెడ్డి మరణించిన విషయం తెలిసిందే. ఈ సంస్మరణ సభకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హిమాచల్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీలు, వామపక్ష పార్టీల నాయకులు, మేధావులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సిపిఐ శ్రేణులు, శ్రేయోభిలాషులు ఈ సభలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మేడారం జాతర పనులను సకాలంలో పూర్తి చేయాలి

- అధికారులు సమన్వయంతో కృషి చేయాలి : సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం మహా జాతర అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళాశిశుసంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. పనుల్లో నాణ్యత పాటించి శాశ్వతంగా నిలిచిపోయేలా ఉండాలన్నారు. ములుగు జిల్లా మేడారంలోని ఐటిడిఎ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, ఐటిడిఎ పిఒ చిత్రమిశ్రాతో కలిసి పూజారులు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సాయంత్రం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పనులు, మాస్టర్ ప్లాన్ రీ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఆర్కియాలజిస్ట్, వివిధ శాఖల అధికారులు ఏయే దశల్లో ఉన్నాయో మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతర లోపు మొదటి విడత పనులను పూర్తి చేయాలని సూచించారు. గద్దెల ప్రాంగణం విస్తరణ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల స్థలం మార్పులు, లైన్‌ల విస్తరణ, నూతన మీడియా పాయింట్ భవనం, ముఖ్యమంత్రి అతిథి భవనం, పూజారుల వసతి భవనం తదితర నిర్మాణాలకు త్వరితగతిన టెండర్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. గద్దెలను వరుస క్రమంలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గరావు, ఇఒ వీరస్వామి, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మత్స్య సంపద అభివృద్ధి స్కీమ్‌పై విచారణ జరిపించాలి'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మత్స్య సంపద అభివృద్ధి కోసం ప్రారంభించిన రూ.1000 కోట్ల స్కీమ్‌పై విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షులు ఎం పద్మనాభరెడ్డి డిమాండ్ చేశారు. ప్రయివేటు వ్యక్తుల నుంచి చేపపిల్లలను కొనొద్దని సూచించారు. మత్స్యశాఖ ద్వారా చేప పిల్లల పెంపకం కోసం ఫిష్ పాండ్‌లు అభివృద్ధి చేయాలని కోరారు. చేపల మార్కెట్లను మరింత అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 2017లో ఆ స్కీమ్‌ను ప్రారంభించారని, వేయి కోట్ల ప్రణాళికలో రూ. 600 కోట్లు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సిడిసి) నుంచి అప్పుగా, కేంద్రం గ్రాంటు రూ.200 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ రూ.56 కోట్లు, మత్స్యకారుల సొసైటీ సభ్యుల నుంచి రూ.144 కోట్లు కేటాయించబడిందని తెలిపారు. ఆ స్కీమ్ అమలు బాధ్యతను తెలంగాణ మత్స్యకారుల సహకారసంస్థకు అప్పగించారని గుర్తుచేశారు. మత్స్యకారుల జీవనప్రమాణాలు పెంచటం, ఏడాది పొడుగూత చేపల అందుబాటు పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ప్రణాళిక లేకనే.. యూరియా కొరత

- రైతుల ఇబ్బందులను తొలగించాలి
- విషజ్వరాలను అరికట్టాలి : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం, రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు వ్యవసాయ ప్రణాళిక లేకపోవడం వల్ల రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా.. కేంద్ర ప్రభుత్వం 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కేటాయించిందన్నారు. ఇందులో ఇప్పటి వరకు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల యూరియానే అందించిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనాలు తప్ప దేశ ప్రజల అభివృద్ధి పట్టదని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను రాజకీయ కక్షతో పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బఫర్ స్టాక్ నిల్వ చేసుకోకపోవడం వల్ల ఇప్పుడు యూరియా కొరత ఏర్పడిందని, దీని వల్ల రైతులు రోజుల తరబడి కార్యాలయాల ఎదుట లైన్‌లో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైన యూరియా తెప్పించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అనేక ఇండ్లు కూలి నిరాశ్రయులయ్యారని తెలిపారు. విష జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారినపడి పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైద్య సేవలు సరిగా అందక సతమతమవుతున్నారన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య బృందాలను పంపించి వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాల్లో పాలకవర్గాలు లేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని, వెంటనే నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు.

నల్లగొండ జిల్లాలో బత్తాయి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, రోజురోజుకూ సాగు తగ్గిపోతోందని చెప్పారు. ప్రభుత్వం బత్తాయి పంటకు ధర కల్పించకపోవడం, రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. బత్తాయి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవి నాయక్, వన్ టౌన్, టూ టౌన్ కార్యదర్శులు డా.మల్లు గౌతమ్ రెడ్డి, బావాండ్ల పాండు, నాయకులు రేమిడాల పరుశురాములు, నాయకులు అప్పారావు, నగేష్ ఉన్నారు.

యూరియా కోసం చేసిన పోరాటం ఫలించింది

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూరియా కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన పోరాటం ఫలించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. యూరియా కోసం ఎదురు చూస్తోన్న రైతులకు ఇదొక శుభవార్త తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యూరియా సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే వచ్చే రెండు రోజుల్లో గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్‌నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లికి 21,325 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలోగా గంగవరం, దామ్ర, కరాయికల్ పోర్టుల నుంచి మరో 29,700 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని వెల్లడించారు. యూరియా చేరిన వెంటనే డిమాండ్ ఉన్న జిల్లాలకు పంపిణీ చేస్తామని తెలిపారు.

14న ప్రదర్శనలకు అనుమతించాలి

- సిఎం రేవంత్ రెడ్డికి ఎంపి అసదుద్దీన్ ఒవైసి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సెప్టెంబర్ 14న రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలకు అనుమతించాలని సిఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సిఎం రేవంత్ రెడ్డిని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసి, మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ సభ్యులు కలిశారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పురాతన మసీదులు, దర్గాలను అలంకరించాలనీ, ఉచిత్ విద్యుత్ సరఫరా చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

'కాళేశ్వరం'పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశమివ్వండి

- స్పీకర్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించే అవకాశం కల్పించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. ఈ మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. కాళేశ్వరంపై పిసి ఘోష్ కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ విప్ కెపి వివేకానంద, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయ కార్యదర్శి ఎం రమేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు సుమధుర్ ఫౌండేషన్ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ బడులకు మద్దతును అందించనున్నట్లు సుమధుర్ గ్రూపునకు చెందిన సిఎస్ఆర్ విభాగం సుమధుర్ ఫౌండేషన్ వెల్లడించింది. రాష్ట్రంలోని 7,000కు పైగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'సుమధుర్ నిర్మాణ శత శతమ్' కార్యక్రమం ద్వారా సమానమైన విద్యా అవకాశాలను పెంపొందించనున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇందుకోసం వందేమాతరం ఫౌండేషన్, తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖతో కలిసి పని చేయనున్నామని సుమధుర్ గ్రూపు ప్రతినిధి జీవన కలకుంట్ల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత 12 జిల్లాల్లోని 25 పాఠశాలల్లో 100 ఉత్తీర్ణత రేటు లక్ష్యంతో విద్యా నాణ్యత, స్కాలర్‌షిప్‌లు, కెరీర్ మార్గదర్శకత్వం అందించనున్నామన్నారు.

గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల మందు పంపిణీ చేయాలి

- పశుసంవర్థక శాఖ అడిషనల్ డైరెక్టర్ మల్లేశ్వరికి జిఎంపిఎస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల మందు పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జిఎంపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో పశుసంవర్థక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరికి ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం రవిందర్ మాట్లాడుతూ 15 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా జీవాలకు నట్టల మందు పంపిణీ చేసేలా చర్యలు చేపడుతామంటూ అడిషనల్ డైరెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. రెండేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఇవ్వడంలేదని చెప్పారు. పశువైద్యశాలల్లో మందులు లేవనీ, జీవాలకు కనీస వైద్యం కూడా అందడంలేదని పేర్కొన్నారు. ప్రయివేటు మెడికల్ షాపుల్లో వేలు వెచ్చించి నట్టల మందులు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెలకాపరుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొన్ని మెడికల్ కంపెనీలు, మెడికల్ షాపుల యజమానులు నకిలీ, నాసిరకం మందులను ఇస్తున్నారని విమర్శించారు. నట్టల నివారణ చర్యలు తీసుకోకపోవడంతో జీవాల్లో క్రమంగా ఉత్పత్తి సామర్థ్యం తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

పాలనలో పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం

- కమిషనర్లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పివి శ్రీనివాస్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీ తనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పివి శ్రీనివాసరావు అన్నారు. వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం-2005పై పిఐఒ, ఆపిలెట్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్, డిసిపిలు షేక్ సలీమా, అంకిత్ కుమార్ స్వాగతం పలికారు. కలెక్టరేట్ ప్రాంగణంలో వారు మొక్కలు నాటారు. అనంతరం అవగాహన సదస్సులో మాట్లాడారు.

అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఇందులోని అంశాలపై అధికారులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆర్‌టిఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాల్లో వరంగల్ జిల్లా ఒకటన్నారు. పిఐఒ అధికారులు ప్రజలకు సకాలంలో పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆర్‌డిఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా, చట్టంలో ఉన్న సమయ పరిమితి లోపల సమాధానమివ్వాలని చెప్పారు. మూడేళ్ల నుంచి 17 వేల ఆర్‌టిఐ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, జిల్లాల పర్యటనలు చేపట్టి కేసులను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. అన్ని శాఖల అధికారులు 4-1బి, సిటిజన్ చార్టర్‌ను పక్కాగా అమలు చేస్తే సమస్యలు తగ్గుతాయని అన్నారు. జిల్లా స్థాయిలో మూడు నెలలకు ఒకసారి అధికారులకు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న ఆర్‌టిఐ దరఖాస్తులపై విచారణ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎసిపి శుభం, డిఆర్‌ఒ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్లు

పోచారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

గాల్లో సిఎం పర్యటన.. పైపైన అధికారుల పరిశీలన

- ప్రమాదాన్ని గుర్తించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- వరద బాధితులకు నష్టపరిహారం అందజేయాలి : జాన్‌వెస్లీ
- పోచారం ప్రాజెక్టును సందర్శించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలలో రాష్ట్ర ప్రజలు అల్లాడుతుంటే ముఖ్యమంత్రి గాల్లో పర్యటన చేస్తున్నారని, జిల్లా అధికారులు పైపై పరిశీలనలతో ప్రజల ఇబ్బందులను గుర్తించడంలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండల పరిధిలోని పోచారం ప్రాజెక్టు, పరిసర పంట పొలాలను శుక్రవారం సిపిఎం బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. వరద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద ప్రాంత బాధితులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోచారం ప్రాజెక్టు ఎనిమిది అడుగులపైకి పొంగడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర పంట నష్టం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాల పంట నష్టం జరిగిందని, నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.35 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్డు మరమ్మతులు ఆలస్యం కావడంతో హైదరాబాద్‌కి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జరిగిన నష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంచనా వేసి తక్షణమే రైతులకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలు, వరదలను పసిగట్టడంలో.. అప్రమత్తమవ్వడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. రాజిపేట్ గంగమ్మ వాగులో పడి చనిపోయిన మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పోచారం ప్రాజెక్టు వరదతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం చెల్లించాలని, లేదంటే న్యాయం జరిగే వరకు సిపిఎం ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు. ఈ పర్యటనలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు డిజి.నర్సింహారావు, జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ, నాయకులు వెంకట్రాములు, శోభన్ నాయక్, అడివయ్య, ఎ మల్లేశం, కె.మల్లేశం, సంతోష్, అజయ్, గౌరీ, కొమురయ్య, అశోక్, నర్సింలు, సాయిలు, నాగమణి, వై.దుర్గ, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అసెంబ్లీ, మండలి సమావేశాలకు సహకరించాలి

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ, మండలి సమావేశాలు సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గతంలో మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో ముందస్తు సమావేశం నిర్వహించారు. స్పీకర్ మాట్లాడుతూ సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని ఆదేశించారు. శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందించాలని చెప్పారు. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలని చెప్పారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం జరుగుతున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే భారీ వర్షాలు కురిసి కొన్ని రూట్లలో రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. ట్రాఫిక్ అధికారులు సమన్వయం చేసుకుని సభ్యులు సరైన సమయానికి సభకు చేరుకునేలా సహకరించాలని అభిప్రాయపడ్డారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలన్నారు. తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయని చెప్పారు.

విజయవంతం చేయండి : ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి

కౌన్సిల్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలని చెప్పారు. అవసరమైన నోడల్ అధికారులు, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలని సూచించారు. తెలంగాణ పోలీసు దేశంలోనే సమర్థవంతమైనదని ప్రశంసించారు. మంచి పేరు ఉన్నదన్నారు. మీ ఆధ్వర్యంలో శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

IN THE SUPREME COURT OF INDIA
CIVIL APPELLATE JURISDICTION
Diary No. 25341 OF 2023
WITH PRAYER FOR INTERIM RELIEF
WITH
155483/2023-APPLICATION FOR EXEMPTION FROM FILING C/C OF THE IMPUGNED JUDGMENT
AND
155484/2023-APPLICATION FOR CONDONATION OF DELAY IN FILING

M. SATYANARAYANA (SINCE DECEASED) ... Petitioner(s)/Appellant(s)
VERSUS
JET AIRWAYS (INDIA) LTD.
AND ANOTHER ... Respondent(s)

To,
1. JET AIRWAYS (INDIA) LTD., THROUGH ITS REGIONAL MANAGER HYDERABAD, ORIENTAL HOUSE, 3 RD PID: 184484/2025 FOR R[1] IN FLOOR, 7J, TATA ROAD, CHURCH DIARY NO. 25341/2023 (SEC GATE, MUMBAI 400020, XII-A) DISTRICT- MUMBAI, MAHARASHTRA

WHEREAS the Petition for Special Leave to Appeal with prayer for interim relief along with application for EXEMPTION FROM FILING C/C OF THE IMPUGNED JUDGMENT, CONDONATION OF DELAY IN FILING, APPLICATION FOR SUBSTITUTION, APPLICATION FOR CONDONATION OF DELAY IN FILING THE APPLICATION FOR SETTING ASIDE THE ABATEMENT, PERMISSION TO FILE PETITION (SLP/TP/WP/..), CONDONATION OF DELAY IN EFILING/CURING THE DEFECTS, CONDONATION OF DELAY IN FILING THE SPARE COPIES, SUBSTITUTED SERVICE above mentioned (copy enclosed) filed in the Registry by Mr. KEDAR NATH TRIPATHY, Advocate on behalf of the Petitioner(s) above named was listed for hearing before this Court on 18th August, 2023, when the Court was pleased to pass the following order:-

"Permission to file SLP is granted. Issue notice on the application for condonation of delay in filing as well as on the special leave petition.
Application (IA No.155486/2023) seeking substitution is allowed.
Delay (IA No.155488/2023) in filing the abatement application is condoned. Application seeking abatement is allowed."

AND WHEREAS, the matter above-mentioned was listed before Ld. Registrar's Court on 24th July, 2025. When the following order was passed:-
"Respondent no.2 has filed counter affidavit. Ld. Counsel for the petitioner has filed an application seeking substituted service on respondent no.1 through paper publication in newspapers, "Praja Shakti", regional language and "Business Diary", English daily. Allowed. Proof of publication be filed within four weeks of such publication. List again on 02.09.2025."

NOW, THEREFORE, TAKE NOTICE that the above petition with prayer for interim relief along with application for **EXEMPTION FROM FILING C/C OF THE IMPUGNED JUDGMENT, CONDONATION OF DELAY IN FILING** will be posted for hearing before this Court in due course and you may enter appearance before this Court either in person or through an advocate on record of this Court duly appointed by you in that behalf within 30 days from the date of service of notice. You may thereafter show cause to the Court on the day that may subsequently be specified as to why delay in filing/refiling SLP be not condoned and Special Leave Petition and interim relief as prayed be not granted and the resultant appeal be not allowed.

You may file your affidavit in opposition to the petition as provided under Rule 14(1) of Order XXI, S.C.R.2013 within 30 days from the date of receipt of notice or not later than 2 weeks before the date appointed for hearing, whichever be earlier, but shall do so only by setting out the grounds in opposition to the questions of law or grounds set out in the SLPs and may produce such pleadings and documents filed before the Court/Tribunal against whose order the SLP is filed and shall also set out the grounds for not granting interim order or for vacating interim order if already granted.

TAKE FURTHER NOTICE that if you fail to enter appearance as aforesaid, no further notice shall be given to you even after the grant of special leave for hearing of the resultant appeal and the matter above mentioned shall be disposed of in your absence.

Dated: 06th August, 2025
ASSISTANT REGISTRAR
Copy to :- Mr. Kedar Nath Tripathy (adv.).
*You are directed to serve the unserved respondents through paper publication and file the proof of publication well before 02.09.2025.
ASSISTANT REGISTRAR.

పత్తి దిగుమతిపై సుంకం మినహాయింపు తగదు

- డాక్టర్ దిడ్డి సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి దిగుమతిపై సుంకం మినాయింపు తగదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు మినహాయింపు పొడిగించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 7న గుజరాత్ లో జరిగే పత్తిరైతుల సభకు తెలంగాణ రైతులు కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నేతలు బుర్ర రాము గౌడ్, విజయ్ మల్లంగి, హేమ జిల్లోజు, శివాజీ, దర్శనం రమేష్, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లిప్‌కార్ట్-ఎస్‌బిఐ కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు విడుదల

హైదరాబాద్ : ఎస్‌బిఐ కార్డ్, ఇ కామర్స్ వేదిక ఫ్లిప్‌కార్ట్ సంయుక్తంగా 'ఫ్లిప్‌కార్ట్ ఎస్‌బిఐ క్రెడిట్ కార్డ్'ను విడుదల చేశాయి. ఈ కార్డుతో ఫ్లిప్‌కార్ట్, మింత్రా, షాప్సీ, క్లియర్‌ట్రిప్‌లో అనేక ఆఫర్లను, క్యాష్‌బ్యాక్‌లను పొందవచ్చని ఇరు సంస్థలు పేర్కొన్నాయి. ఈ కార్డుతో చేసే వ్యయాల ద్వారా మింత్రాలో 7.5 శాతం, ఫ్లిప్‌కార్ట్, షాప్సీ, క్లియర్‌ట్రిప్‌లో 5 శాతం చొప్పున క్యాష్‌బ్యాక్ పొందవచ్చని ఎస్‌బిఐ కార్డు పేర్కొంది. "ఈ కార్డు ఇ-కామర్స్ వినియోగదారులకు సీమ్‌లెస్, రివార్డింగ్ అనుభవాన్ని అందిస్తుందని ఎస్‌బిఐ కార్డ్ సిఇఒ సలీల పాండే పేర్కొన్నారు. ఇది లక్షలాది కుటుంబాలకు విలువను అందిస్తుందని ఫ్లిప్‌కార్ట్ సిఇఒ కల్యాణ్ కృష్ణమూర్తి అన్నారు.

లెక్సస్ ఇండియా 'స్మార్ట్ ఓనర్‌షిప్ ప్లాన్'

హైదరాబాద్ : లగ్జరీ కార్ల తయారీ కంపెనీ లెక్సస్ ఇండియా స్మార్ట్ ఓనర్‌షిప్ ప్లాన్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఆర్థిక సౌలభ్యంతో ప్రీమియం అనుభవాలను అందించే ఉద్దేశ్యంతో దీన్ని డిజైన్ చేశామని ఆ కంపెనీ ప్రెసిడెంట్ హికారు ఇకేయుచి పేర్కొన్నారు. ఈ ప్లాన్‌లో సులభమైన ఇఎంఐ ద్వారా లెక్సస్ కార్లను సొంతం చేసుకోవచ్చన్నారు. తమ లెక్సస్ ఇఎస్, ఎన్ఎక్స్, ఆర్ఎక్స్ మోడళ్లపై అష్యూర్డ్ బైబ్యాంక్ ఆఫర్ అందుబాటులో ఉంటుందన్నారు.

అమ్మకాల్లో మారుతి సుజుకి ట్రూ వాల్యూ రికార్డ్

హైదరాబాద్ : రీసేల్ కార్లను విక్రయించే మారుతి సుజుకి ట్రూ వాల్యూ 60 లక్షల యూనిట్లను విక్రయించి నూతన మైలురాయిని సాధించినట్లు వెల్లడించింది. 2001లో ప్రీ ఓన్డ్ కార్ల విక్రయాల వ్యాపారంలోకి వచ్చిన ఈ సంస్థ గడిచిన ఒక్క ఆర్థిక సంవత్సరం 2024-25లో 4,92,697 యూనిట్లను విక్రయించింది. "60 లక్షల విక్రయాల మైలురాయిని జరుపుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. ట్రూ వాల్యూ కస్టమర్ల విశ్వాసానికి కృతజ్ఞతలు.' మారుతి సుజుకి ఇండియా ప్రతినిధి పార్థో బెనర్జీ పేర్కొన్నారు.

'వరద' సహాయ చర్యలకు ప్రజలు సహకరించాలి

- వి నాగిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద బాధిత ప్రజలను కాపాడే క్రమంలో కీలక విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సహకరించాలని తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవల డైరెక్టర్ జనరల్ వి నాగిరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాణాలు కాపాడే కీలక సమయాల్లో సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు సమాచారం ప్రాణాలకు తెగించి కాపాడుతున్న క్షేత్రస్థాయి సిబ్బంది మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తోందని తెలిపారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసిన ఆరు జిల్లాల్లో 1,646 మంది వరద బాధితుల ప్రాణాలను కాపాడినట్టు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో అంధకారంలో సహకరించని వాతావరణంలోనూ తమ సిబ్బంది పని చేశారని వారిని అభినందించారు. అయితే జిఆర్ కాలనీలో మొదటి అంతస్థులో చిక్కుకుపోయిన ఒక కుటుంబం రెస్క్యూ చేస్తామంటే తిరస్కరించారనీ, దానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం రావడం, అత్యవసర సిబ్బందిని ఫోన్ల ద్వారా పదే పదే ఇబ్బంది పెట్టడం తగదని హితవు పలికారు.

నేటి నుంచి అసెంబ్లీ

- ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న శాసనసభ, మండలి
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సంతాపం తెలపనున్న అసెంబ్లీ
- అనంతరం వాయిదా - మధ్యాహ్నం క్యాబినెట్ భేటి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10.30 గంటలకు శాసనసభ, మండలి కొలువుదీరనున్నాయి. ఇటీవల మరణించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు శాసనసభ సంతాపం ప్రకటించనుంది. ఆయనకు నివాళులర్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, బిఆర్ఎస్ సభ్యులు ప్రసంగిస్తారు. అనంతరం సభ వాయిదా పడనుంది. ఆ తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన సభా వ్యవహారాల కమిటీ (బిఎసి) సమావేశమై అసెంబ్లీని ఎన్ని రోజులు నడపాలనే విషయమై చర్చించి, ఒక నిర్ణయానికి వస్తుంది. అయితే సమావేశాలను నాలుగైదు రోజులపాటు నిర్వహించే అవకాశముందని అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శాసనసభా సమావేశాల్లో కాళేశ్వరం కమిషన్ రిపోర్టును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సభలోని ఎమ్మెల్యేలందరికీ కాళేశ్వరం కమిషన్ నివేదిక కాపీలను అందజేయనున్నారు. మండలిలో ఎమ్మెల్సీలకు కూడా ఆ కాపీలను అందజేస్తారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రధానంగా కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికపైనే చర్చించనున్నారు. అందుకోసమే అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరుస్తున్నారు. మరోవైపు శనివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో రాష్ట్ర మంత్రివర్గం భేటీ కానుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లే ప్రధాన అజెండాగా క్యాబినెట్ భేటీ జరగనుంది. బిసి రిజర్వేషన్లపై అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై కూడా మంత్రివర్గం చర్చించనుంది.

భారీ వర్షాలతో 580 అంగన్‌వాడీ భవనాలకు నష్టం

- ఒక్క నిర్మల్ జిల్లాలోనే 100కిపైగా
- నష్టాన్ని తేల్చిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు
- మంత్రి సీతక్క ఆదేశాలతో సురక్షిత భవనాల్లోకి తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు తీవ్ర నష్టం జరిగింది. అధికారుల సమగ్ర నివేదిక ప్రకారం సొంత భవనాల్లో నడుస్తున్న 440, రెంట్ ఫ్రీ భవనాల్లో నడుస్తున్న 140, మొత్తంగా 580 అంగన్‌వాడీ కేంద్రాలు దెబ్బతిన్నాయి. పైకప్పుల లీకేజీలు, గోడలు, బేస్‌మెంట్‌లో పగుళ్లు, ఫ్లోర్ దెబ్బతినడం వంటి సమస్యలు ఎక్కువగా కనిపించాయి. ఒక్క నిర్మల్ జిల్లాల్లోనే 100కిపైగా అంగన్‌వాడీ కేంద్రాలకు నష్టం వాటిల్లింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 75, కామారెడ్డి జిల్లాలో 49, గద్వాల్ జిల్లాలో 40, హన్మకొండ జిల్లాలో 25, మెదక్ జిల్లాలో 25, వనపర్తి జిల్లాలో 22, ఆసిఫాబాద్ జిల్లాలో 20, ములుగు జిల్లాలో 20 చొప్పున భవనాలు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు అక్కరకు రాకుండా పోయాయి. కొన్ని కేంద్రాల్లో వర్షపు నీరు లోపలకు చేరడంతో బియ్యం, పప్పులు, పాల డబ్బులు, నూనె ప్యాకెట్లు, స్టడీ మెటీరియల్ తడిసి ముద్దయ్యాయి.

ఆ భవనాల మరమ్మత్తులకు భారీగా నిధులు అవసరమవుతాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు అంచనా వేశారు. సొంత భవనాల మరమ్మత్తులకు రూ. 14 కోట్లు, రెంట్ ఫ్రీ భవనాల మరమ్మత్తులకు రూ.మూడు కోట్లు ఖర్చవుతుందని లెక్కగట్టారు. ఈ నేపథ్యంలో తడిసిన భవనాల్లో అంగన్వాడీ సేవలు తక్షణం నిలిపివేయాలని, సమీపంలోని ప్రభుత్వ భవనాలు లేదా పాఠశాల ప్రాంగణాల్లో కేంద్రాలను తాత్కాలికంగా తరలించాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. అలాగే తడిసిపోయిన సరుకుల బదులుగా వెంటనే కొత్త సరుకులను సరఫరా చేయాలని స్పష్టం చేశారు. పిల్లల పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, విద్య ఒక్కరోజు కూడా అంతరాయం లేకుండా కొనసాగాలని సూచించారు. సురక్షిత భవనాల్లో అంగన్‌వాడీ సేవలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను తాత్కాలికంగా వేరే చోట్లకు తరలించే ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు. గర్భిణీలకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించండంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

కెసిఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్‌వి అబద్ధాలు : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కె తారకరామారావు విమర్శించారు. శుక్రవారం ఈ మేరకు ఎక్స్‌వేదికగా ట్వీట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.7,000 కోట్ల రుణ వడ్డీ చెల్లిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాగ్ నివేదిక ఈ వాదన తప్పని తేల్చిందని గుర్తుచేశారు. వాస్తవానికి, గత నాలుగు నెలల్లో సగటు నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణ భారాన్ని ఎక్కువ చేసి చూపిస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. వర్షాలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే సిఎం రేవంత్‌రెడ్డి మాత్రం విలాసాలపై దృష్టి సారించారని విమర్శించారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, విలాసవంతమైన, లాభదాయకమైన ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రూ. 3,50,000 కోట్ల 2036 ఒలింపిక్స్ నిర్వహణ, రూ. 1,50,000 కోట్ల మూసీ సుందరీకరణ, రూ. 225 కోట్ల హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టుల గురించి చర్చలు జరుపుతున్నారని విమర్శించారు.

మా పరిహారం సంగతేంది?

- అడ్డగించి వెనక్కి పంపిన నిర్వాసితులు
- పోలీసు బందోబస్తుతో కానుకుర్తిలో సర్వేకు వెళ్లిన అధికారులు
- నిర్వాసిత గ్రామాల్లో నిరసనలు
- పేరపల్ల ఆర్‌డిఒ కార్యాలయం ముట్టడి



నిరసన తెలుపుతున్న గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ సర్వే నేపథ్యంలో భూనిర్వాసితులపై ప్రభుత్వం పోలీసు నిర్బంధం ప్రయోగించింది. భూనిర్వాసితుల సంఘం ముఖ్య నాయకులను శుక్రవారం తెల్లవారుజామునే హౌస్ అరెస్టు చేసి ఆ తర్వాత ధన్వాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులు, బలవంతపు భూసేకరణతో గ్రామాల్లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. పేరపల్ల ఆర్డీఓ కార్యాలయాన్ని నిర్వాసితులు ముట్టడించారు. ఊట్కూరులో ఆర్డీఓను అడ్డగించారు. నాయకుల నిర్బంధం అనంతరం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామానికి ఉదయం పోలీస్ బందోబస్తుతో సర్వేకు వెళ్లిన అధికారులకు భూనిర్వాసితుల నుంచి తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదురైంది.

ఉదయం నాలుగు గంటలకే భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జి.వెంకట్రామి రెడ్డి, నాయకులు ఉడుమల్ గిద్ద గోపాల్, బండమీది బలరాం, అంజిలయ్య గౌడ్, మహేష్ కుమార్ గౌడ్, జోషి, రామకృష్ణను హౌస్ అరెస్టు చేసి ధన్వాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులను అరెస్టు చేశాక.. దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలో అధికారులు భూసర్వేకు వెళ్లారు. అక్కడ నిర్వాసితుల నుంచి తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదురైంది. మా నేతలను పోలీస్ స్టేషన్లో నిర్బంధించి, పోలీస్ బందోబస్తుతో సర్వేకు రావడం ఏంటి అని గ్రామ శివారులోనే భీమ్‌రెడ్డి, బసిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, అన్వర్ ఆధ్వర్యంలో స్థానికులు రోడ్డుపై బైటాయించారు. నిర్వాసితుల డిమాండ్ న్యాయమైనదేనని, తగిన పరిహారం అందిస్తామని మాట ఇస్తూనే.. మరోవైపు నిర్బంధంతో, బలవంతంగా భూసేకరణకు పూనుకోవడం దారుణమని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిహారం విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వకుండా సెంటు భూమి కూడా సర్వే చేసేందుకు ఒప్పుకోబోమని భీష్మించి కూర్చున్నారు. అదే సమయంలో పేరపల్ల గ్రామ భూ నిర్వాసితులు అంజి, అంజప్ప ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. ఊట్కూరు మండల కేంద్రంలో ఆర్‌డిఒ రామచందర్‌ను నాయకులు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భూనిర్వాసితులు అడ్డగించారు. న్యాయమైన పరిహారం 35 లక్షల రూపాయలు ఇవ్వాలని ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతిపాదిత ప్రాజెక్ట్ పొడవునా కాట్రపల్లి నుంచి కానుకుర్తి వరకు భూనిర్వాసిత గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు.

నారాయణపేట మండలం కోటకొండ, బొమ్మనపాడు గ్రామాల్లోనూ నిరసనలు జరిగాయి. భూనిర్వాసితుల న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలని సిపిఎం నాయకులు దస్తప్ప, బొమ్మన్‌పాడ్ బల్‌రామ్ డిమాండ్ చేశారు. మధ్యాహ్నం రెండు గంటల అనంతరం భూ నిర్వాసితుల సంఘం నాయకులను ధన్వాడ పోలీస్ స్టేషన్ నుంచి విడుదల చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చేందర్ జిల్లా ఉపాధ్యక్షులు ధర్మరాజు గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా కొనసాగింది.

కుట్రపూరితంగా భూసేకరణ

నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జి వెంకట్రామిరెడ్డి

ప్రభుత్వం మోసపూరితంగా భూ సేకరణకు యత్నిస్తోంది. నాయకులను నిర్బంధంలో ఉంచి కుట్రపూరితంగా భూసేకరణకు ప్రయత్నించడం దారుణం. సరైన పరిహారం ఇస్తామంటూనే భూనిర్వాసితులతో చెలగాటమాడుతున్నది. ఇంతకాలం ప్రభుత్వ పెద్దల మాట నమ్మాం.. ఉద్యమ కార్యాచరణను వాయిదా వేసుకున్నాం.. ఇప్పుడు పోలీసు నిర్బంధం.. పహారాలో భూసర్వేకు వచ్చారు. నమ్మించి మోసపూరితంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ విధానంపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం.

రైతులతో మాట్లాడుతున్న కోదండరెడ్డి

బత్తాయి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- ఎర్రబెల్లిలో బత్తాయి తోటల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బత్తాయి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి చెప్పారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని గుంటుపల్లి, ఎర్రబెల్లి గ్రామాల్లో సాగు చేస్తున్న బత్తాయి తోటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బత్తాయి రైతులు మన్నెం వెంకన్న తాము ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఆంధ్ర ప్రాంతం నుంచి మొక్కలను కొనుగోలు చేసి.. అనేక జాగ్రత్తలు తీసుకొని పంట సాగు చేస్తున్నామని అన్నారు. బత్తాయి రైతులకు హార్టికల్చర్ నుంచి ఎలాంటి మద్దతూ అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి బత్తాయి పంటను సాగుచేస్తే.. దళారులు సిండికేట్‌గా మారి తగినంత ధర ఇవ్వడంలేదని తెలిపారు. మొక్కలు పెరిగినప్పటికీ సరిగా పూత, దిగుబడి లేక నష్టపోతున్నామని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ.. సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతులకు న్యాయం చేసేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం బత్తాయి రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. రైతులు బత్తాయి పంటను నిల్వ ఉంచుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందొచ్చని చెప్పారు. బత్తాయి రైతుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఈ పర్యటనలో బత్తాయి రైతు కమిటీ సభ్యులు సురుగురు శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యడవల్లి వల్లభ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ అంకతి సత్యం, నూకల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింగ్ విజయ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారులు రిషిత ఉన్నారు.

సిపిఎం నాయకుల అరెస్టుకు జాన్ వెస్లీ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతాంగానికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలంటూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి వెంకట్రామరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, బాల్‌రాం, అంజయ్య గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు జోషి, నాయకులు మహేష్ కుమార్ గౌడ్, రామకృష్ణలను అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డిపిఆర్) ఇప్పటివరకు ప్రకటించలేదని విమర్శించారు. ఎంత భూమి అవసరమవుతుందో స్పష్టమైనటువంటి ప్రకటన లేదని తెలిపారు. బలవంతంగా రైతుల భూముల్లోకి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నాయకులను అరెస్టు చేసి భూ సర్వే నిర్వహించడం, నిర్బంధం ప్రయోగించడం సరైంది కాదని తెలిపారు. ఇప్పటికే రైతుల మీద నాయకుల మీద కేసులు కూడా నమోదు చేశారని వివరించారు. ఈ కేసులను వెంటనే ఎత్తేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భూనిర్వాసితులకు న్యాయం చేయమంటే అరెస్టులా?

- తెలంగాణ రైతు సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మక్తల్-నారాయణపేట-కోడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములను కోల్పోతున్న రైతాంగానికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారమందించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. నిర్వాసితులకు న్యాయం చేయమంటే అరెస్టులు చేస్తారా? అని ప్రశ్నించింది. భూనిర్వాసుల జిల్లా గౌరవ అధ్యక్షులు జి.వెంకట్రామరెడ్డి, సలహాదారులు గోపాల్, బాల్‌రాం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజయ్యగౌడ్, జిల్లా నాయకులు మహేశ్‌కుమార్‌గౌడ్, రామకృష్ణ, సిఐటియు నాయకులు జోషిలను వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మక్తల్-నారాయణపేట-కోడంగల్ ఎత్తిపోతల పథకానికి డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డిపిఆర్) ఇప్పటివరకు ప్రకటించలేదని విమర్శించారు. ఎంత భూమి అవసరమవుతుందో రాష్ట్ర ప్రభుత్వం వివరాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. బలవంతంగా రైతుల భూముల్లోకి వెళ్లి సర్వే నిర్వహించడం సరైందికాదని హెచ్చరించారు. నిర్వాసితులకు అండగా ఉన్న నాయకులను అరెస్టు చేసి భూసర్వే నిర్వహించడం, నిర్బంధం ప్రయోగించడమేంటని ప్రశ్నించారు. రైతులు, నాయకులపై నమోదు చేసిన కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

తహశీల్దార్ బండి నాగేశ్వరరావుపై ఎసిబి కేసు

- కార్యాలయం, ఇళ్లల్లో సోదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ జిల్లా ఫోర్ట్ వరంగల్ మండలం తహశీల్దార్ బండి నాగేశ్వరరావు కార్యాలయంలో ఎసిబి అధికారులు శుక్రవారం సోదాలు చేశారు. ఆయనపై అక్రమ ఆస్తుల కేసు నమోదు చేశారు. తహశీల్దార్ తన సర్వీసులో అవినీతి కార్యకలాపాలకు పాల్పడి ఆదాయానికి మించి ఆస్తులను సంపాదించినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆయన ఇల్లు, కుటుంబ సభ్యుల ఇండ్లు, కార్యాలయం సహా ఏడు ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. అతని వద్ద ఇళ్ల పత్రాలు, 17ఎకరాల 10గుంటల వ్యవసాయ భూమి పత్రాలు, 70తులాల బంగారు ఆభరణాలు, 1,791 గ్రాముల వెండి వస్తువులు, రెండు కార్లు, ద్విచక్ర వాహనం, 23 గడియారాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ఆస్తులపై విచారణ జరుగుతోంది. తహసీల్దార్‌ను అరెస్టు చేసి, వరంగల్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు.

బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడిగా ఇబ్రాం శేఖర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడిగా ఇబ్రాం శేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో జాతీయ కో ఆర్డినేటర్ అథర్ సింగ్ రావుతో కలిసి ఆయన ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు రాజ్యాధికారం సాధించడమే బిఎస్‌పి అంతిమ లక్ష్యమని చెప్పారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుతోనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని బలంగా నమ్మి, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు 36 మంది బిఎస్‌పి ఎంపిలు మద్దతు తెలిపారని గుర్తుచేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాలు బూటకమని, ప్రత్యేక తెలంగాణ కోసం వేలాది మంది బహుజనులు ఆత్మహత్య చేసుకుంటే అధికారం మాత్రం అగ్రవర్ణాలకు దక్కిందని చెప్పారు. జనాభాలో 15 శాతం ఉన్న ఆధిపత్య కులాలు 85 శాతం ఉన్న ప్రజలను ఇంతకాలం పాలించడమెందని ప్రశ్నించారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో దోపిడీ చేసి, ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అవుటర్ రింగ్ రోడ్, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటు పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఇబ్రాం శేఖర్‌కు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో జాతీయ కో ఆర్డినేటర్ అథర్ సింగ్ రావు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల ఇన్‌చార్జ్‌గా ఎం బాలయ్యతోపాటు స్టేట్ సెంట్రల్ కోఆర్డినేటర్లుగా దాగిళ్ల దయానంద్, నిషాని రామచందర్ ప్రధాన కార్యదర్శులుగా బోయిని చంద్ర శేఖర్ ముదిరాజ్, బోడపట్ల ఈశ్వర్, మేతరి ప్రభు కుమార్, మంచాల శ్రీకాంత్ , కార్యదర్శులుగా శీలం అనితా రెడ్డి, లింగంపల్లి యాదగిరి, జాడి రాజు, కార్యవర్గ సభ్యులుగా ఎనగందుల వెంకన్న, మాతంగి అశోక్, కోశాధికారిగా నాయిని ప్రణయ్ కుమార్లను నియమించారు.

వ్యవహారిక భాషకు పట్టం కట్టిన గిడుగు రామమూర్తి

ప్రజాశక్తి - కల్చరల్

నాడు కేవలం గ్రాంథిక భాష మాత్రమే తెలుగు సాహిత్యంలో రాజ్యమేలుతున్న సమయంలో ప్రజలు అందుబాటులో వాడుక భాషలోనే రచనలు చేయాలని వ్యవహారిక భాషకు పట్టం కట్టిన మహనీయుడు గిడుగు రామమూర్తి అని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో కార్యక్రమ పరంపరలో భాగంగా గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ గిడుగు రామమూర్తి కేవలం తెలుగు భాషా భిమాని మాత్రమే కాకుండా శ్రీకాకుళం విజయనగరం ప్రాంతాల్లో ఉండే గిరిజన జాతులు సవరలు భాషకు లిపినీ ఉద్ధరించి వారి కోసం పాఠశాలలను సొంత డబ్బు వెచ్చించి ఏర్పరచిన సామాజిక చింతనా పరుడని వివరించారు. యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ చిన్న సహాయం చేసి ప్రచారం కోసం ఎదురుచూసే వారు ఉన్న నేడు గిడుగు రామమూర్తి ప్రచారాలు కోసం కాకుండా నిస్వార్థంగా తాను అనుకున్న తెలుగు భాషను ప్రజల భాషగా ఉపయోగించేలా నాటి కవి పండితులను ధిక్కరించి నిలిచారని చెప్పారు. అందుకు ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా గుర్తింపు పొందిందని తెలిపారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై సెన్సార్ బోర్డ్ సభ్యుడు సూరి బుచ్చి రాములు, గాయకుడు ప్రదీప్ చంద్ర పాల్గొన్నారు.

పిల్లలకు చైతన్యపరిచే కార్యక్రమాలపై ప్రచారం చేయండి

- టి శాట్ సిఇఒ వేణుగోపాల్‌రెడ్డిని కోరిన సీతాదయాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్య, ఉపాధి, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం వంటి కార్యక్రమాల మాదిరిగానే పిల్లలకు అవగాహన కల్పించే, చైతన్యపరిచే కార్యక్రమాలను కూడా ప్రచారం చేయాలని టీశాట్ సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డిని చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో టీశాట్ సిఇఒను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించాలని అలాగే పిల్లల కోసమూ ప్రత్యేక కార్యమాలు భవిష్యత్‌లో కమిషన్ నుంచి టీశాట్ ద్వారా చేస్తామని వేణుగోపాల్‌రెడ్డి హామీనిచ్చారు. డిజిటల్ మాధ్యమాల ప్రభావం పిల్లలపై చాలా ఉందనీ, పిల్లలతో పాటు వారి తల్లితండ్రులకూ అవగాహన కల్పించే కార్యక్రమాలు చేస్తామని హామీనిచ్చారు. పిల్లల హక్కుల పరిరక్షణ, సామాజిక దురాచారాలు పాటించొద్దనీ, బాల్యవివాహాలు చేయొద్దని అవగాహన కల్పించే కమ్యూనిటీ క్యాంపైన్ ప్రతి నెలా టీ-శాట్ ద్వారా నిర్వహించాలని చైర్‌పర్సన్ సీతాదయాకర్ రెడ్డి కోరారు. డిజిటల్ మీడియా ప్రభావం, జెజె యాక్ట్, ఇతర చట్టాల అవగాహన కల్పించడం ద్వారా టీశాట్ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు వచన్ కుమార్, వందన గౌడ్, చందన, అపర్ణ, సరిత, ప్రేమలత అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.